అప్పన్నను దర్శించుకున్న విశ్వం చిత్ర యూనిట్

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారిని విశ్వం చిత్రం యూనిట్ దర్శించుకుంది. తొలుత వీరు కప్ప స్తంభం ఆలింగనం చేసుకున్నారు. తమ తమ గోత్ర నామాలతో స్వామివారికి సంకల్పం చేయించారు. వేద పండితులు ఆశీర్వచనం పలికారు. ఆలయ ఏఈఓ ఆనంద్ కుమార్, పర్యవేక్షణాధికారి త్రిమూర్తులు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్వామివారిని దర్శించుకున్న వారిలో నటుడు గోపీచంద్, దర్శకులు శ్రీను వైట్ల, పృథ్వీ, శకలక శంకర్, జీవా తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా ముగిసిన
మద్యం దుకాణాల కేటాయింపులు

లాటరీ ద్వారా 155 షాపులకు మద్యం దుకాణాలకు అనుమతులు
కూటమి నేతల అనుచరులదే హవా

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ప్రైవేటు మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానించిన ప్రభుత్వం సోమవారం లాటరీ ద్వారా మద్యం దుకాణాలకు అనుమతులు జారీ చేసింది. రాజకీయ నేతల అనుచరులదే హవాగా కనిపించింది. మద్యం ద్వారా దండిగా డబ్బు సంపాదించాలన్న కొంతమంది నేతలు 20 నుండి 30 చోట్ల దరఖాస్తులు తమ అనుచరులతో చేయించారు. వీటిలో కనీసం 10 నుంచి 15 దుకాణాలు లాటరీలో వారికి దక్కాయి. దక్కనిచోట సక్సెస్ విజేతపై బెదిరింపు చర్యలకు దిగి తమతో సిండికేట్ కావాలని లేదంటే వ్యాపారం జరగనివ్వమని హెచ్చరికలు జారీ చేసినట్లు సమాచారం. మద్యం దుకాణాల ద్వారా ప్రభుత్వానికి భారీగా ఆదాయం తీసుకురావాలని లక్ష్యంలో భాగంగా ప్రభుత్వం ప్రైవేట్ మద్యానికి అనుమతులు జారీ చేసింది. మద్యం దుకాణాల లాటరీ ప్రశాంతంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముగిసింది. భారీ పోలీసు బందోబస్తు నడుమ వుడా చిల్డ్రన్ థియేటర్‌లో సోమవారం ఉదయం 8 గంటలకే దరఖాస్తుదారులు క్యూ కట్టారు. విశాఖ జిల్లాలో 155 మద్యం దుకాణాలకు లాటరీ పక్రియను విశాఖ జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ ప్రారంభించారు. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డి.రామచంద్రమూర్తి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఈఎస్ఆర్ ప్రసాద్, ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున ఈ లాటరీ ప్రక్రియను ప్రశాంతంగా ముగించారు. ఎక్సైజ్ శాఖ గజిట్ సీరియల్ ప్రకారం లాటరీ పద్ధతిలో దుకాణాల కేటాయింపు చేశారు. మాన్యువల్ పద్ధతి ద్వారా అధికారులు డ్రా ప్రక్రియ చేపట్టారు. విశాఖ జిల్లాలో 155 దుకాణాలకు గాను 4139 దరఖాస్తులు చేసుకున్నారు. సీరియల్ నెంబర్ ప్రకారం మద్యం దుకాణాలకు దరఖాస్తుదారుల సంఖ్య గల లాటరీ బిళ్ళలను ఓ బాక్స్‌లో వేసి అందులో సక్సెస్ (విజేత) సంఖ్య పేరును వెల్లడించారు.

మద్యం షాపుల దరఖాస్తుదారుల్లో అత్యధికమంది ఎమ్మెల్యేల అనుచరులు, పలువురు కార్పొరేటర్లు, కార్పొరేటర్ల అనుచరులు, కూటమి నేతలతో పాటు వైసిపి పార్టీకి చెందిన పలువురు నేతల అనుచరులు కూడా ఉన్నారు. జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడుగా ఉన్న బెహరా భాస్కరరావు దాదాపు పది షాపులకు దరఖాస్తు చేసుకోగా మూడు షాపులు దక్కినట్లు తెలుస్తుంది. అనేక నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు అనుచరులే సిండికేట్‌గా మారి పలువురు మహిళల చేత మద్యం దుకాణాల దరఖాస్తు చేయించినట్లు ఈ లాటరీ ప్రక్రియలో వెల్లడయ్యింది. కొంతమంది నేతల వద్ద కూలీలుగా పని చేసుకుంటూ ఉన్న వారి చేత దరఖాస్తులు చేయించడం విడ్డూరం. వారే లాటరీ ప్రక్రియకు హాజరు కావడం అనేకమందిని ఆశ్చర్యానికి గురి చేసింది. లాటరీలో ఎవరికి షాప్ వచ్చినా తమకు ఇవ్వాలని కూటమిలో ఓ ఎమ్మెల్యే తీవ్ర ఒత్తిడి చేస్తున్నట్లు కూడా తెలుస్తుంది. మరికొంతమంది షాపులు దక్కించుకున్న దరఖాస్తుదారులు మూడు రెట్లు డిపాజిట్ ధర ఇచ్చేస్తే అప్పగిస్తామని చెప్పినట్లు కూడా తెలుస్తుంది. మొత్తానికి విశాఖలో మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది.

కళాసీలకు సర్వీస్ బెనిఫిట్స్ చెల్లించాలి

ముఠా కార్మిక సంఘం ధర్నా

విశాలాంధ్ర - విశాఖ: రేసపువానిపాలెం వద్ద స్పెన్సర్ హైపర్ మార్కెట్ వద్ద విశాఖపట్నం జిల్లా ముఠా కార్మిక సంఘం (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో సోమవారం ధర్నా జరిగింది. ఈ ధర్నాలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.మన్మధరావు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ రెహమాన్ మాట్లాడుతూ స్పెన్సర్స్‌లో గత 20 సంవత్సరాలుగా 22 మంది కళాసీలు పనిచేస్తున్నారని తెలిపారు. మార్కెట్టుకు వచ్చిన కూరగాయలు, పండ్లు, ఇతర సరుకులను ఎగుమతులు, దిగుమతులు, గ్రేడింగ్లు వంటి పనులు చేసేవారని చెప్పారు. స్పెన్సర్ హైపర్ మార్కెట్‌ను యాజమాన్యం సంస్థ మూసివేయాలని నిర్ణయించిందని తెలిపారు. దీంతో ఇప్పటి వరకూ పనిచేస్తున్న కళాసీలు ఉపాధి పోయి రోడ్డున పడ్డారని అన్నారు. వీరికి సర్వీస్ బెనిఫిట్స్ ఇవ్వాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. అసలు యాజమాన్యం కలకత్తాలో ఉంటూ లేబర్ ఆఫీసులో జరిగే జాయింట్ మీటింగులకు రాకుండా సమస్యను పరిష్కరించకుండా కాలయాపన చేయడం మంచిది కాదని తెలిపారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేస్త్రి బి.నూక నాయుడు, బి.ఏసుబాబు, ఎస్.అచ్చం నాయుడు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

'అపోలో చెస్ట్ పెయిన్ క్లినిక్' ప్రారంభం

విశాలాంధ్ర - విశాఖపట్నం: యువతలో పెరుగుతున్న ఆకస్మిక గుండె మరణాలను ఎదుర్కొనేందుకు అపోలో హాస్పిటల్స్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో గల హెల్త్ సిటీలో ఏర్పాటు చేసిన 'అపోలో చెస్ట్ పెయిన్ క్లినిక్'ను హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కష్ట సమయాలలో రోగులకు సహాయం చేసే వైద్యుల సేవలు ప్రశంసనీయం అన్నారు. అపోలో రీజనల్ సీఈవో సుబ్రమణ్యం మాట్లాడుతూ రోగులకు సులభంగా స్నేహ పూర్వకంగా వైద్యం అందించడంలో తన కర్తవ్యాన్ని కొనసాగిస్తూ.. ఇప్పుడు ఛెస్ట్ పెయిన్ క్లినిక్ ప్రారంభించిందని తెలిపారు. ఛాతి నొప్పితో బాధపడే ఎవరికైనా ఇది తక్షణ సహాయం అందిస్తుందన్నారు. ఆ నొప్పి గుండెకు సంబంధించినదైతే తక్షణమే చికిత్స అందు తుందన్నారు. ఆ నొప్పి గుండెకు సంబంధించినది కాకపోతే, అపోలో ఆసుపత్రులు ఎలాంటి చార్జీలు వసూలు చేయవన్నారు. గుండె నొప్పి, ఇతర కారణాల వల్ల కలిగే నొప్పి మధ్య తేడాను తెలుసుకోవడం కష్టమేనన్నారు. ఒకప్పుడు గుండె సమస్యలు వృద్ధుల సమస్యగా ఉండేవన్నారు. జీవనశైలిలో మార్పులు, కోవిడ్-19 తర్వాత యువతలో అధికంగా కనిపిస్తున్నాయని చెప్పారు. ఈ సమస్యను ప్రారంభ దశలో గుర్తించడం, చికిత్స అవసరమన్నారు. నొప్పిపై సందేహం ఉన్న వారికి ఈ క్లినిక్ తక్షణ వైద్య పరీక్షలు అందించే అవకాశాన్ని కల్పిస్తుందన్నారు.

వంట నూనెల ధరలు తగ్గించాలి: సీపీఐ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం భారీగా పెంచిన వంటనూనె ధరలు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం అక్కయ్యపాలెం నరసింహారావు రైతు బజార్ వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీపీఐ నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర వస్తువుల కాయగూరల ధరలు భారీగా పెంచి ప్రజలకు ఆహార భద్రత లేకుండా చేస్తున్నాయని మండిపడ్డారు. భారీగా పెంచిన వంటనూనె, వంటగ్యాసు, నిత్యవసర వస్తువుల ధరలు, కాయగూరల ధరలను తగ్గించి ప్రజలకు ఆహార భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజా ఆగ్రహానికి ప్రభుత్వాలు తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. స్థానిక ప్రజాప్రతినిధులు నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎలక్షన్లు వచ్చినప్పుడు ప్రజల పక్షం అని చెప్పిన ప్రజాప్రతినిధులు ఎన్నికలు అయిన వెంటనే ఫ్లెక్సీలు వేసుకొని ప్రచారం చేసుకుంటూ సొంత వ్యాపారాలు చేసుకుంటున్నారు తప్ప ప్రజలు, కార్మికుల సమస్యలపై నియోజకవర్గ ప్రజల సమస్యలపై పనిచేసే ప్రజాప్రతినిధులు కరువయ్యారన్నారు. ఈ ధర్నాలో సిపిఐ నాయకులు రావికృష్ణ, చిల్లర సంఘం నాయకులు జి.శ్రీనివాసరావు, పి.సాయికుమార్, వెంకరాయుడు, ఎం.రాము ఏకప్పు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలు కబ్జా చేస్తే చర్యలు

భీమిలి ఆర్డీఓ సంగీత్ మాధుర్
విశాలాంధ్ర కథనానికి స్పందన

విశాలాంధ్ర - ఆనందపురం: సర్కార్ స్థలాలు కబ్జాలు పేరిట విశాలాంధ్ర పత్రికలో ప్రచురించిన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను తహశీల్దార్ శ్యామ్ ప్రసాద్ ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఉమాదేవి రెవెన్యూ అధికారుల సమక్షంలో కొంతమేర షెడ్డులను తొలగించి మిగతావి ఒకటి రెండు రోజుల్లో పూర్తిగా తీయాలని హెచ్చరించారు. అలాగే భీమిలి ఆర్డీఓ సంగీత్ మాధుర్ స్థల పరిశీలన చేసి ప్రభుత్వ స్థలంలో ఎవరైనా అక్రమ కట్టడాలు కట్టినట్లయితే ఉపేక్షించేది లేదని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా మండల తహశీల్దార్ శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాన్ని ఎవరైనా ఆక్రమించినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

16న జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఈ నెల 16వ తేదీన జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ సీఈవో పి. నారాయణమూర్తి సోమ వారం తెలిపారు. జడ్పీ ఛైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన ఆమె ఛాంబర్ సమీపంలోని ఏసీ హాలులో, జడ్పీ సమావేశ మందిరంలో ఒకటి నుంచి ఏడు వరకు గల స్థాయీ సంఘ సమావేశాలు వేర్వేరుగా ఉదయం 10.00 నుంచి 12.00 గంటల వరకు జరుగుతాయని, సంబంధిత ఏర్పాట్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. 2, 5వ స్థాయీ సంఘ సమావేశాలు ఉదయం 10.00 గంటలకు, 4, 3వ స్థాయీ సంఘ సమా వేశాలు 11.00 గంటలకు, 1, 6, 7వ స్థాయీ సంఘ సమావేశాలు ఉదయం 12.00 గంటలకు జరుగుతాయని వివరించారు. ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, ఎంపీపీలు, అధికారులు సమావేశాలకు హాజరుకావాలని ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు.

రతన్ టాటాకు గీతం ఘన నివాళి

విశాలాంధ్ర - మధురవాడ: ప్రముఖ పారిశ్రామిక వేత్త, టాటా గ్రూప్ సంస్థల ఛైర్మన్ దివంగత రతన్ టాటాకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం సోమవారం ఘన నివాళులు అర్పించింది. గీతం ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు అధ్యక్షతన జరిగిన సంతాప సభలో ఆయన మాట్లాడుతూ దేశ ఆర్థిక అభివృద్ధిలో, ఉపాధి కల్పనలో టాటా సంస్థల పాత్ర విడదీయలేనిదన్నారు. ప్రజలను ప్రభావితం చేసే ప్రతి రంగంలోను రతన్ టాటా నేతృత్వంలోని టాటా గ్రూప్ సంస్థలు ఎంతో నిబద్ధత, విలువలతో పని చేయడం మరవలేనిదన్నారు. గీతం విశ్వవిద్యాలయానికి టాటా గ్రూప్ సంస్థలకు ముఖ్యంగా టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌కు అవినాభావ సంబంధం ఉందన్నారు. దాదాపు 10 వేల మంది గీతం పూర్వ విద్యార్థులు టిసిఎస్ వివిధ స్థాయిలో పనిచేస్తున్నారని అన్నారు. అలాగే గీతంకు టిసిఎస్‌కు మధ్య అవగాహన ఒప్పందాలు సమర్థంగా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. దేశ ప్రగతికోసం రతన్ టాటా అంకిత భావంతో చేసిన కృషి నేటి తరం యువతకు మార్గదర్శకం కావాలన్నారు. గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ డైరక్టర్ కె.వి.ఉమాదేవి మాట్లాడుతూ రతన్ టాటా ఎంతో నిబద్ధత, సమాజం పట్ల భాద్యత గల పారిశ్రామిక వేత్త అని కొనియా డారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరక్టర్ కె.నాగేంద్రప్రసాద్, విశాఖ జిసిజిసి డైరక్టర్ వంశీకిరణ్ సోమయాజుల, డిప్యూటీ డైరక్టర్ డాక్టర్ బి.రవికిరణ తదితరులు పాల్గొన్నారు.

మాకు జీవనోపాధి కల్పించండి

దిబ్బపాలెం మహిళలు కలెక్టర్‌కు వినతి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: దిబ్బపాలెం మత్స్యకార కుటుంబాలకు చెందిన తాము గంగవరం పోర్టు కోసం భూములు ధారాదత్తం చేసామని, చేపల వేట చేసుకునే జీవనోపాధి కూడా కోల్పోయామని, ఇప్పటివరకు తమకు పోర్టు యాజమాన్యం తుది ప్రయోజనాలు కల్పించలేదని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. దిబ్బపాలెంకు చెందిన కదిరి ధనం, తెడ్డు ఎల్లమ్మ, కదిరి ఎల్లమ్మ, కంటుముచ్చు ముత్తమ్మ అనే మహిళలు జీవనోపాధి కల్పించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. గత 15 సంవత్సరాలుగా తాము గంగవరం పోర్టు యాజమాన్యం నుంచి ఎటువంటి ప్రయోజనాలు పొందలేదన్నారు. భర్తను కోల్పోయి జీవనోపాధి లేక, బతుకు తెరువు కోసం అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రస్తుతం తామంతా కూలి పనులు చేసుకుని బతుకుతున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గంగవరం పోర్టు కోసం భూములు సేకరించిందని, అప్పట్లో తాము భూములు ఇచ్చినప్పటికీ, ఇల్లు గాని ఉపాధి గాని పొందలేకపోయామన్నారు. ఇల్లు కేటాయింపుల్లో కూడా అనేక అవకతవకలు జరిగాయని అన్నారు. గంగవరం పోర్టు యాజమాన్యం నుంచి తమకు ఎటువంటి ప్రయోజనం పొందకపోవడం వల్ల మాపై ఆధారపడ్డ పిల్లల జీవితాలు కూడా ప్రమాదంలో పడ్డాయని అన్నారు. తమకు జీవనా ధారమైన చేపల వేట చేసుకుని బతికే వారమని, ప్రస్తుతం అది కూడా లేక అనేక సమస్యలతో సతమతమవుతున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ తమను ఆదుకొని తగిన న్యాయం చేయాలని కోరారు.

ప్రజా ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ చూపించండి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి వచ్చే వినతులకు పరిష్కారం చూపడంలో అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని, రీ ఓపెన్ కాకుండా చూసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. ప్రజలు అందించే వినతులను ఒకటికి రెండు సార్లు క్షుణ్ణంగా పరిశీ లించాలని, తదుపరి నాణ్యమైన రీతిలో పరిష్కరించాలని సూచించారు. అవసరమైతే క్షేత్రస్థాయి పర్యటన చేసి సమస్య పూర్వాపరాలు తెలుసుకొని ఫిర్యాదుదారు సంతృప్తి చెందేలా చర్యలు చేపట్టాలని హితవు పలికారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ మీటింగు హాలులో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఆయన అధికారులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. గత వారం అందిన ఫిర్యాదుల పరిష్కారం, తాజా పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు.

వివిధ సమస్యలపై పీజీఆర్ఎస్‌కు 120 వినతులు

సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు ప్రజల నుంచి వివిధ సమస్యలపై 120 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ విభాగానికి చెందినవి 48, జీవీఎంసీకి చెందినవి 29, పోలీసు శాఖకు సంబంధించి 9, ఇతర శాఖలకు సంబంధించి 34 ఉన్నాయి.

జిల్లా కలెక్టర్‌తో పాటు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సీతారామమూర్తి, జీవీఎంసీ ఏడీసీ, ఇతర విభాగాల ఉన్నతాధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ సాహిత్యం చిరస్థాయిగా నిలుస్తుంది

ఎమ్మెల్యే గంటాశ్రీనివాసరావు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ప్రజా గాయకుడు గద్దర్ సాహిత్యం చిరస్థాయిగా నిలుస్తుందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఈనెల 20న పౌరగ్రంథాలయంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి 7 గంటల వరకు నిర్వహిస్తున్న "గద్దరన్న యాది"లో కార్యక్రమ పోస్టర్‌ను సోమవారం తన స్వగృహంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గద్దర్ తన జీవితకాలం పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజల కోసం సాహిత్యాన్ని రాస్తూ తన పాటల ద్వారా చైతన్యం తీసుకొచ్చారని అన్నారు. అనేక ఉద్యమాలకు తన పాట శక్తివంతంగా ఉంటుందని ఎప్పటికీ గద్దర్ పాట ఈ తెలుగు రాష్ట్రాలలో ఏదో ఒక మూల వినిపిస్తూనే ఉంటుందన్నారు. తను జీవించినంత కాలం పాటతోటే ప్రశ్నించాడని గద్దర్ని గుర్తు చేసుకున్నారు. అనేక కళా సంస్థలు కళాకారులు, రచయితలు, మేధావులు, విద్యార్థులు అంతమంది కలిసి గద్దర్‌ను గుర్తు చేసుకోవడంలో గద్దర్ సాహిత్యాన్ని స్మరించుకోవడంలో కళా సమస్యలు చేస్తున్న కృషిని బట్టి తెలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కోరాడ రాజబాబు, డాక్టర్ పంచకర్ల సందీప్, ప్రజాగాయకుడు మజ్జి దేవిశ్రీ, పర్యావరణ కళామండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి కొయ్య రామకృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ఏపీఈపీడీసీఎల్ కంట్రోల్ రూమ్ నెంబర్లు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: భారీ వర్షాల నేపథ్యంలో ఎలాంటి పరిస్థితులు తలెత్తినా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి సంస్థ పరిధిలోని 11 జిల్లాల అధికారులను అప్రమత్తం చేశారు. ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలతో పాటు కోనసీమ, కాకినాడ, ఏలూరు, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఆంధ్రప్రదేశ్ తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ముందస్తు ఏర్పాట్లు చేసింది. విద్యుత్తు సరఫరాలో ఎలాంటి అంతరాయాలు లేకుండా చూడాలని, అవసరమైన యంత్రాంగం, పరికరాలు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఎస్ఈ, ఈఈలను ఆదేశించారు.

తుఫాన్ వల్ల ఏర్పడే విద్యుత్ అంతరాయాలకు సంబందించిన సమాచారాన్ని అందించేందుకు ఏపీఈపీడీసీఎల్ కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేసింది. భారీ వర్షాల ప్రభావానికి తెగిపడిన విద్యుత్ వైర్లు, పడిపోయిన విద్యుత్ స్తంభాలు, విద్యుత్ లైన్లపై పడిపోయిన చెట్లకొమ్మల పట్ల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించింది. వాటి సమాచారాన్ని కార్పొరేట్ కార్యాలయం లోని టోల్ ఫ్రీ నెం 1912కి లేదా కంట్రోల్ రూమ్ నంబర్లకు ఫోన్ చేసి చెప్పాలని విజ్ఞప్తి చేశారు.

విశాఖపట్నం కార్పొరేట్ కార్యాలయం - 8331018762
శ్రీకాకుళం -9490612633
విజయనగరం -9490610102
పార్వతీపురం మన్యం -8332046778
విశాఖపట్నం -7382249881
అనకాపల్లి -9490610022
అల్లూరి సీతారామరాజు -9490610026
కోనసీమ -9440904477
కాకినాడ -9493178718
ఏలూరు -9440902926
తూర్పుగోదావరి -7382299960
పశ్చిమగోదావరి -9490610143.

పూజించే పెదవులు కన్నా సాయం చేసే చేతులు మిన్న

విశాలాంధ్ర - భీమిలి: పుట్టిన దగ్గర నుండి అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆర్థికంగా చితికిపోయి చికిత్స చేయించడానికి కూడా డబ్బులు లేని పరిస్థితుల్లో ఉదార స్వభావంతో ముందుకు వచ్చి ఆర్థిక సాయం చేసిన దాతలకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు కృతజ్ఞతలు తెలియజేసారు. భీమిలి జోన్ 3వ డివిజన్ బోయవీధి గ్రామంలో నివాసం ఉంటున్న మద్దిల శ్రీను, రమా ఇందిర దంపతులకు ప్రధమ సంతానంగా జన్మించిన మద్దిల రాణికి పుట్టిన దగ్గర నుండి తీవ్రమైన అనారోగ్యం సమస్యలతో బాధపడుతుంది. సామాన్య కుటుంబంలో పుట్టి పెరిగిన రాణి పడుతున్న బాధలు చూసి వారికి సాయం చేయుటకు ముందుకు వచ్చిన భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు, నక్కా రవి కుమార్‌లు 24,000 రూపాయలు ఆర్థిక సాయాన్ని చేయగా గంటా నూకరాజు చేతులమీదుగా భీమిలి పార్టీ కార్యాలయంలో పాప తండ్రి మద్దిల శ్రీనుకి అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాసరపు నాగరాజు, మారోజు సంజీవకుమార్, రాజగిరి రమణ, గండిబోయిన పోలిరాజు, నెక్కెళ్ళ వెంకటరావు, కాసరపు ఎల్లాజీ, బొడ్డు రమేష్, వాడమొదలు తవుడయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన్నంగా రహదారి

నీలకుండీలు-బోని రహదారిలో ప్రయాణం నరకమే

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో రహదారుల పరిస్థితి రోజురోజుకీ అస్తవ్యస్తంగా తయారవుతున్నాయి. అనేక ప్రమాదాలు జరిగినప్పటికీ అధికారుల్లో మాత్రం ఎటువంటి చలనం లేదు. ఎక్కడ చూసినా గోతుల రోడ్లలో ప్రయాణాలు సాగించవలసిన పరిస్థితి ఉంది. అధికారులతో చెప్పినా, ఫిర్యాదులు చేసినా పరిస్థితి మారలేదని ప్రజలు వాపోతున్నారు. నీలకుండీల జంక్షన్ నుండి వయా బోని వరకు రహదారి పూర్తి దారుణ పరిస్థితిలో ఉంది. వాహనాల్లో వెళ్లి రావాలంటే ఎక్కువ సమయాన్ని వెచ్చించాల్సి వస్తుంది. రాత్రి వేళలో ప్రయాణం సాగించాలంటే వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. చిన్నపాటి వర్షానికి గోతులలో నీరు చేరి చెరువుల వలె తలపిస్తున్నాయి. ప్రభుత్వం మారిన పరిస్థితి మారలేదని వాహనదారులు ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రోడ్ల పరిస్థితిని చక్క దిద్దాలని ప్రజల సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 58 ఫిర్యాదులు

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: ప్రతీ సోమవారం పోలీసు కాన్ఫరెన్స్ హాల్ నందు నగర పోలీసు కమీషనర్ శంఖబ్రత భాగ్చి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 58 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం చేయవద్దని అధికారులకు స్పష్టమైన ఆదేశాలను జారీ చేశారు. పోలీసు ఉన్నతాధికారులు ఫిర్యాదులను పరిశీలించి ఫిర్యాదిదారులతో స్వయంగా మాట్లాడి, వారి వారి సమస్యలను తెలుసుకొని, సంబంధిత పోలీసు అధికారులతో తక్షణమే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి, సమస్యకు సంబంధించి, చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. కుటుంబ కలహాలు, భూ వివాదాలు, భార్య భర్తల గొడవలు, మోసానికి సంబంధించినవి తదితర ఫిర్యాదులు వచ్చాయి.

ఉత్సాహంగా పల్లె పండగ

విశాలాంధ్ర - పెందుర్తి: ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ పిలుపుమేరకు పెందుర్తి నియోజకవర్గంలో పల్లె పండగ-పంచాయతీ వారోత్సవాలు ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పెందుర్తి మండలం ముదపాక గ్రామపంచాయతీ,

గుర్రం పాలెం గ్రామపంచాయతీ, వాలిమెరక జుతాడ గ్రామపంచాయతీ, ఎస్ఆర్ పురం గ్రామ పంచాయతీలలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేశ్ బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేత్రుత్వంలో ఒక్కో పంచాయితీకి 25 కోట్లు నిధులు కేటాయించి పల్లెలను సుసంపన్నం చేయనున్నట్లు తెలి పారు. కూటమి ప్రభుత్వం పాలనలో గ్రామాలకు స్వర్ణయుగం రానుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మధుపాడ నాగమణి, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గణబాబు కృషితో అభివృద్ధి పథంలో 90వ వార్డ్

విశాలాంధ్ర-గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ 90వ వార్డ్‌లోని వినోద్ నగర్‌లో సి.సి డ్రెయిన్‌లో పూడిక పేరుకుపోయి శిథిలావస్థకు చేరుకోవడం, అప్రోచ్ రోడ్ గుంతలు పడి ప్రమాదాలు జరుగుతున్నాయని సమస్యను వినోద్ నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, స్థానిక నాయకులు, కాలనీ వాసులు 90వ వార్డ్ కార్పొరేటర్ బొమ్మిడి రమణ దృష్టికి తీసుకురాగా, బొమ్మిడి రమణ స్పందించి, పశ్చిమ నియోకవర్గం శాసనసభ్యులు గణబాబు సూచన మేర 17.80 లక్షల జీవీఎంసీ వార్డ్ అభివృద్ధి నిధులు మంజూరు చేయించి శంకుస్థాపన చేసారు. కార్యక్రమంలో 90వ వార్డ్ అధ్యక్షులు యలమంచిలి ప్రసాద్, కార్యదర్శి కలిశెట్టి కానకరావు, ఏఈ వెంకట లక్ష్మీ, విశాఖ జిల్లా పార్లమెంట్ ఉపాధ్యక్షులు నరవ పైడిరాజు, వినోద్ నగర్ రెసిడెన్షియల్ అసోసియేషన్ ప్రతినిధులు శ్రీను, వేముల నర్సింగ్ రెడ్డి, అబ్దుల్ బషీర్, బొడ్డేపల్లి వేణు గోపాల్, యుగంటేశ్వర్‌రావు, సాగి కృష్ణ మూర్తి రాజు, జోగరావు, మురళి, ధనవేణి, లత, తాడివాలస వెంకట్‌రావు, జీవీఎంసీ పబ్లిక్ వర్క్స్ విభాగం వర్క్స్ ఇన్‌స్పెక్టర్లు రామ కృష్ణ, సోమేశ్, మహిళలు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఫోరం ఫర్ ఆర్టిఐ విశాఖ జిల్లా అధ్యక్షునిగా వడ్డాది

విశాలాంధ్ర - పెందుర్తి: సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు వీలుగా ఏర్పడిన "ఫోరం ఫర్ ఆర్టిఐ" విశాఖ జిల్లా అధ్యక్షునిగా సీనియర్ జర్నలిస్ట్, పెందుర్తికి చెందిన

వడ్డాది ఉదయకుమార్‌ను నియమించారు. ఈ మేరకు మంగళగిరిలో జరిగిన ఆర్టీఐ దినోత్సవ సందర్భంగా "ఫోరం ఫర్ ఆర్టిఐ" జాతీయ అధ్యక్షులు ప్రతిపాటి చంద్రమోహన్ ఉదయకుమార్ నియామకాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ఉదయకుమార్ మాట్లాడుతూ విశాఖ జిల్లాలో ప్రజలకు విద్యార్థులకు ఉద్యోగులకు సమాచార హక్కు చట్టం గురించి పూర్తి అవగాహన కలిగించేందుకు త్వరలో సదస్సులు ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. విశాఖ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన ఉదయ కుమార్‌ను ఆర్టిఐ కమిషనర్ రెహనా బేగం అభినందించారు. తనను ఈ పదవిలో నియమించిన జాతీయ అధ్యక్షులు ప్రత్తిపాటి చంద్రమోహన్‌కు ఉదయకుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు.

అటానమస్ వర్క్‌షాప్ విద్యార్థులకు ఎంతో మేలు

విశాలాంధ్ర - ఆనందపురం: అటానమస్ వర్క్ షాపులతో విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా విద్యార్థులు నేర్చుకోవడానికి చక్కటి అవకాశం అని జవహర్లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్సిటీ సిఎస్ఇ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.విశ్వనాథ్ రాజ్ తెలిపారు. మండలంలో శొంఠ్యాం ఎన్ఎస్ఆర్ఐటి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో అధ్యాపకులకు అటానమస్ వర్క్‌షాప్‌పై విద్యార్థులకు అవ గాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఎన్‌బీఏ అక్రిడేషన్ ప్రాసెస్‌లో అసైన్మెంట్, ఎవిలేషన్, ప్రక్రియలపై జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. ప్రోగ్రాం ఫలితాలను గురించి క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ శంభు ప్రసాద్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల ద్వారా బోధనలో మెళ కువలు తెలుసుకోవడానికి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్.తాళ్లవలస, గొల్లల తాళ్లవలసలో పల్లె పండుగ

విశాలాంధ్ర - భీమిలి: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "పల్లె పండగ " వారోత్సవాల్లో భాగంగా భీమిలి మండలం, ఆర్ తాళ్ళ వలస పంచాయతీ, గొల్లల తాళ్ళ వలసలో

ఎంఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.30 లక్షలతో చేపట్టనున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సోమవారం లాంఛనంగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద చేపట్టనున్న సిమెంట్ రోడ్లు, కాల్వల నిర్మాణ పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎండిఓ ఎన్.హనుమంతరావు, ఈఓపిఆర్‌డి శకనకల రమేష్ నాయుడు, ఎంఎన్ఆర్ఇజిఎస్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.ఆంజనేయులు, ఏపిఓ జివిఎస్ గౌరి, టెక్నికల్ అసిస్టెంట్ బి.అత్యుత్, పంచాయితీ రాజ్ డీఇ, ఏఇ, టీడీపీ మండల అధ్యక్షులు డిఎఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ పంచముఖ గాయత్రి ఆలయంలో అన్న సమారాధన

విశాలాంధ్ర - పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడి వాడ, శ్రమ శక్తి నగర్‌లో వెలిసిన శ్రీ పంచముఖ గాయత్రీ దేవి ఆలయంలో భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. నిర్వాహకుల ఆహ్వానం మేరకు స్థానిక కార్పొరేటర్ శ్రీ సేనాపతి వసంత శంకర్రావు ముఖ్య అతిథిగా పాల్గొని అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రమణమూర్తి, శంకర ప్రసాద్, చెన్నాజీ, అప్పలరాజు, ఎన్డీఏ కార్యకర్తలు లైనల్ మహేష్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

అమేజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్‌లో హోమ్, కిచెన్ అవుట్ డోర్స్‌పై రాయితీలు

విశాలాంధ్ర- విశాఖపట్నం: పండగ సీజన్ ఆరంభమవడంతో, అమేజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ 2024 సమయంలో అందుబాటులో ఉన్న హెూమ్, కిచెన్, అవుట్ డోర్స్ లో విస్తృత శ్రేణి ఉత్పత్తులు అందుబాటులో తీసుకువచ్చారు. అగారో, ప్రెస్టీజ్, సెల్లో, కొఫ్లార్, నీల కమల్, క్యూబో, గోద్రేజ్, బాష్ మరియు ఇంకా ఎన్నో ప్రముఖ బ్రాండ్స్ పై ఉత్తేజభరితమైన డీల్స్ అందుబాటులోకి తీసుకువచ్చింది. అమేజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ సమయంలో విక్రేతల నుండి గొప్ప డీల్స్ తో ఇక్కడ కొన్ని ప్రసిద్ధి చెందిన హెూమ్, కిచెన్ మరియు అవుట్ డోర్స్ ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి. ఉపకరణాలపై ఉత్తేజభరితమైన ఆఫర్లలో హెూమ్ కిచెన్ అవుట్ డోర్‌కి సంబంధించిన అనేక ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి.

గుడ్ల డాక్టర్ అస్తమయం

విశాలాంధ్ర - పీఎం పాలెం: గత 46 ఏళ్లగా మధురవాడ ప్రజలకు వైద్య సేవలు అందించిన ఎస్.అచ్యుతారామం(గుడ్ల డాక్టర్)ఆదివారం పరమపదించారు. 1948 సంవత్సరంలో జన్మించిన ఆయన 1969 సంవత్సరంలో వైద్య ఆరోగ్య శాఖలో చేరి 1978-2003 వరకు మధురవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య విస్తరణ అధికారిగా విధులు నిర్వహించారు. 2006 సంవత్సరంలో ఉద్యోగ విరమణ చేశారు. మధురవాడ పరిసర 14గ్రామాల ప్రజలకు రెండు రూపాయలకే వైద్య సేవలను అందించిన ఘనత ఆయనకే దక్కింది. మధురవాడలో స్థానిక ప్రజలకు ఆయన రెండు రూపాయలు డాక్టరుగా,గుడ్ల డాక్టరుగా సుపరిచితులై వైద్య సేవలను అందించేవారు.

నేడు వివిధ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలంలో అనంతవరం గ్రామంలో ఎన్ఆర్‌జిఎస్ పథకం ద్వారా రోడ్లు, కాలువలు నిర్మాణానికి 15వ తేదీ మంగళవారం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం 10:30కు పెంట గ్రామంలో ఎన్ ఆర్ జి ఎస్ పథకం ద్వారా రోడ్లు, కాలువలు నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం స్థానిక నాయకులతో కలిసి వివిధ సమస్యలు, పరిష్కారాలపై చర్చించనున్నారు.

టైర్ 3, అంతకు మించిన మార్కెట్‌లలో రీచ్‌ను విస్తరించడానికి మీషోతో మామార్త్ భాగస్వామ్యం

విశాలాంధ్ర/విశాఖపట్నం : భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న వ్యక్తిగత సంరక్షణ బ్రాండ్‌లలో ఒకటైన మామార్త్ మీషోతో భాగస్వామ్యం కలిగి ఉందనీ సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సహకారం అధిక-నాణ్యత గల వ్యక్తిగత సంరక్షణ ఉత్ప త్తులను లోతైన చొచ్చుకుపోయే ప్రాంతాలకు మరింత అందుబాటులోకి తీసుకురావడానికి మరియు అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలలో వృద్ధిని పెంచడానికి సెట్ చేయబడిందన్నారు. సెమీ-అర్బన్ ప్రాంతాలలో ప్రీమియం, సహజమైన మరియు టాక్సిన్-రహిత వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్‌ను ఉపయోగించాలని మామార్త్ లక్ష్యంగా పెట్టుకుందన్నారు. మీషో విక్రయ కాలంలో బ్రాండ్ ఐదు రెట్లు వృద్ధిని సాధించిందని, మామార్త్ ఇప్పుడు మీషోలో రాబోయే 12 నెలల్లో 100 కోట్ల ఏఆర్ఆర్ ని చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకుందనీ వివారించారు.మీషో యొక్క విస్తృతమైన రీచ్ ద్వారా మామార్త్ భారతదేశం అంతటా లోతైన మార్కెట్‌లలోకి ప్రవేశించగలిగి, బెల్గాం (కర్ణాటక), కాశీపూర్ (ఉత్తరాఖండ్), బొకారో (జార్ఖండ్), శివకాశి (తమిళనాడు) మరియు ఖుషీనగర్ (ఉత్తరప్రదేశ్) వంటి ప్రాంతాలలో వినియోగదారులను చేరుకుందన్నారు. హెూనాసా కన్స్యూమర్ లిమిటెడ్ సహ వ్యవస్థాపకుడు, సీఈవో వరుణ్ అలఘ్ మాట్లాడుతూ "మామెర్త్‌లో, మా వినియోగదారులకు అత్యంత అవసరమైన చోట మేము ఎల్లప్పుడూ ఉండటానికి ప్రయత్నిస్తున్నా మన్నారు. నాణ్యత మరియు టాక్సిన్ లేని అందం వ్యక్తిగత సంరక్షణ కోసం మేము ఎక్కువ డిమాండ్‌ను చూస్తున్నామన్నారు. టైర్ 3 మరియు చిన్న మార్కెట్‌ల నుండి ఉత్పత్తులు మీషోతో ఈ భాగస్వామ్యం ఈ అంతరాన్ని మరింత తగ్గించడంలో మాకు సహాయపడుతోందన్నారు.

దేశ ఆర్థిక వృద్ధిలో విశాఖ ఉక్కు కీలక పాత్ర

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: దేశ ఆర్థిక వృద్ధిలో విశాఖ ఉక్కు కీలక పాత్ర పోషిస్తుందని విశాఖ ఇన్‌కం ట్యాక్స్ జాయింట్ కమిషనర్ కె.ప్రసాద్ అన్నారు.



ఆదాయపు పన్ను శాఖ జాయింట్ కమీషనర్ ఆఫ్ ఇన్‌కమ్ టాక్స్, టి.డిఎస్ సర్కిల్, విశాఖపట్నం ఆధ్వర్యంలో అవగాహన సదస్సును సోమవారం ఉక్కునగరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లుడుతూ విశాఖపట్నం ఉక్కు కర్మాగారం యొక్క కార్పొరేట్ సంస్థ అధికారులు/ఉద్యోగులకు నిబంధనలు గురించి అవగాహన కల్పించడానికి, మినహాయింపు/మినహాయింపుల యొక్క నిజమైన క్లెయిమ్, వారి సిబ్బందికి సలహాలను జారీ చేయడానికి, పన్ను చెల్లింపు దారుల సేవలు, ఆదాయపు పన్ను శాఖలో ఇటీవల పరిణామాలు, శాఖ చేపట్టిన ఫ్లాగ్‌షిప్ పథకాలు మొదలైన విషయాలపై అవగాహన కల్పించారు.

కార్పొరేటర్ పివి సురేష్‌పై కక్షసాధింపు

రౌడీషీట్‌ను ఎత్తివేయాలి
పోలీసు కమిషనర్‌కు వైసీపీ కార్పొరేటర్ల వినతి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ నగరంలో విశేష సేవా కార్యక్రమాల నిర్వహణ ద్వారా ప్రజల మన్ననలు పొంది కౌన్సిల్ వేదికగా ఎల్లప్పుడూ ప్రజాపక్షంగా వ్యవహరించే కార్పొరేటర్ డాక్టర్ పివి సురేష్‌పై రాజకీయ కక్షలతో ఇబ్బందులకు గురిచేయాలనే దురుద్దేశంతో నమోదు చేసిన అక్రమ రౌడీషీట్‌ను వెంటనే తొలగించాలని విశాఖ జిల్లా వైసీపీకి చెందిన కార్పొరేటర్లు కోరారు. ఈ మేరకు సోమవారం నగర పోలీసు కమిషనర్ కార్యాలయంలో కమిషనర్ శంకబ్రత బాగ్చీని డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్ సారథ్యంలో కలిసి నగర్ మేయర్ హరివెంకట కుమారి తరపున వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ నిత్యం ప్రజాసేవలో పరితపిస్తూ అధికారపక్షంలో ఉన్నా కూడా ఎల్లపుడూ ప్రజాపక్షాన నిలిచే సేవకుడిగా, కౌన్సిల్‌లో ప్రజాధనాన్ని గౌరవ వేతనంగా కూడా తీసుకోకుండా పనిచేస్తున్న నిస్వార్థ నాయకుడిగా పశ్చిమ నియోజకవర్గంతో పాటుగా విశాఖ నగర వ్యాప్తిగా విశేష కీర్తిని సొంతం చేసుకున్న డాక్టర్ పివి సురేష్‌పై కూటమి నేత కక్షసాధింపునకు ఫలితంగా చట్టంలోని లొసుగులను అడ్డుపెట్టుకొని అక్రమంగా రౌడీషీట్ నమోదు చేయడం దారుణమని అన్నారు. యువకులు రాజకీయాలలోకి రావాలంటూ ఊకదంపుడు ప్రసంగాల నడుమ తమ వారసులను ప్రజలకు పరిచయం చేసే నాయకులు నిస్వార్థంగా ప్రజలకు సేవచేస్తూ పార్టీలకు అతీతంగా అందరు నాయకులచేత శభాష్ అనిపించుకుంటున్న సురేష్‌ను అణగదొక్కాలని ప్రయత్నం చేయటం అన్యాయం అని అన్నారు. అధికార దుర్వినియోగం చేస్తూ సాక్షాతూ ఒక స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా ఉన్న ఒక సిఐ కూటమి నాయకుడిపై ఉన్న స్వామిభక్తిని ప్రదర్శిస్తూ ఒక్కకేసు ఉన్నా రౌడీషీట్ తెరుస్తామని నిస్సిగ్గుగా చెప్పటం కూటమి ప్రభుత్వంలో అధికారుల పనితీరుకు నిదర్శనమని అన్నారు. ప్రభుత్వ ఆస్థిని కాపాడటమే లక్ష్యంగా తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించిన కార్పొరేటర్ పివి సురేష్‌పై రాజకీయ కుట్రతో అక్రమ కేసులు బనాయించి వాటి ఆధారంగా రౌడీషీట్‌ను నమోదు చేసి వేధించటం సమాజానికి తప్పుడు సంకేతాలను ఇవ్వడంతో పాటుగా నిస్వార్థ సేవాతత్పరతకు గొడ్డలిపెట్టుగా మారే ప్రమాదం ఉందన్నారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో లేని పొలిటికల్ రౌడీ షీట్ల సంస్కృతిని పెంచిపోషించే విధానాన్ని కూటమి నేత విడనాడాలని హితవు పలికారు. డాక్టర్ పివి సురేష్‌పై నమోదు చేసిన అన్ని కేసులు రాజకీయ కక్షపూరిత నేపథ్యంలోనే నమోదు చేశారని, ఆయనపై రౌడీషీట్‌ను ఎత్తివేయాలని సాక్షాత్తు నగర మేయర్ ఇచ్చిన వినతిపత్రాన్ని కమీషనర్‌కు అందించగా ఈ విషయంపై తనకు సమాచారం లేదని ఇది స్థానిక ఎసిపి లేదా సిఐల స్థాయిలో అంశమే అని తాను కూడా ఒకసారి ఈ అంశాన్ని పరిశీలిస్తానని పోలీసు కమిషనర్ హామీ ఇచ్చినట్లు వారంతా తెలిపారు. కమిషనర్‌ను కలిసినవారిలో జివిఎంసి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాస్, కార్పొరేటర్లు కెవిఆర్ స్వాతి, మొల్లి లక్ష్మి, కె అనిల్ కుమార్ రాజు, నక్కిళ్ళ లక్ష్మి, అక్కరమాని పద్మ, కొణతాల సుధ, గులిగిందల లావణ్య, గుడివాడ అనూష, ఎ రోహిణి, ముర్రు వాణి, ఉరుకూటి రామచంద్రరావు, చెన్నా జానకీరామ్, తిప్పల వంశీరెడ్డి, మహమ్మద్ ఇమ్రాన్, బల్లా లక్ష్మణరావు, గుండపు నాగేశ్వరరావు, రెయ్యి వెంకటరమణ తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు అందజేసే అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్ తెలిపారు. అర్జీల వివరాలను జిల్లా కలెక్టరు అధికా రులను అడిగి తెలుసుకున్నారు. వినతులను క్రింది స్థాయి అధికారులకు అప్పగించకుండా స్వయంగా పరిశీలించాలని, సమస్యలపై స్వయంగా అవగాహన కలిగిఉండాలన్నారు. అర్జీలను సకాలంలో పరిష్కరించాలని, అర్జీదారులకు సంతృప్తికరమైన పరిష్కారం చూపాలన్నారు. సోమవారం జిల్లా కలెక్టరు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి బి. దయానిధి, ఎస్డిసి రమామణి, సుబ్బలక్ష్మీ, హౌసింగు పిడి శ్రీనివాస్ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు వ్యక్తిగత, సామాజిక అంశాలపై 151 అర్జీలు అందజేసారు. రెవిన్యూశాఖకు సంబంధించి 99, పంచాయతీ రాజ్ శాఖకు 11, ఇతర శాఖలకు 41 వినతులు వచ్చాయి.

జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కు వచ్చిన 26 ఫిర్యాదులలో ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు చీటింగ్ తదితర ఫిర్యాదులు అందాయి. ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ , అదనపు ఎస్పీ నేరుగా ఫిర్యదుదారుల నుండి అర్జీలను స్వీకరించి, ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించారు.ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎం.దీపిక హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్ పాల్గొన్నారు.

ఎంఎంఎల్ కళాశాలలో తెలుగు సబ్జెక్టును పునరుద్ధరించాలి

విశాలాంధ్ర - అనకాపల్లి: జిల్లాలోని ఎఎంఎఎల్ ఎయిడెడ్ కళాశాలలో తెలుగు సబ్జెక్టు పునరుద్ధరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్లో గ్రీవెన్స్‌లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.రమణ మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుండి ఎఎంఎఎల్ కళాశాలలో ఎన్ సి సి, ఎన్ఎస్ఎస్ కోర్సులు ప్రాధాన్యత వల్ల విద్యార్థులు అధిక సంఖ్యలో చదువుతున్నారన్నారు. తెలుగు రాష్ట్రంలో తెలుగు లేని కళాశాలగా ఎఎంఎఎల్‌ను చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ దేశాల్లో తెలుగు ప్రాముఖ్యతను కొనియాడుతుంటే తెలుగు రాష్ట్రంలో చదువుతున్న విద్యార్థులకు తెలుగు సబ్జెక్టును దూరం చేయడం అత్యంత దుర్మార్గమని చర్య అన్నారు. తెలుగు సబ్జెక్టుని పునరుద్ధరించి కళాశాలకు పూర్వ వైభవం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కే. అర్జున్, నాయుడు పాల్గొన్నారు.

మందు గుండు సామాగ్రి పట్టివేత

విశాలాంధ్ర - గొలుగొండ: గొలుగొండ మండలంలో ఏటి గైరం పేట గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన లక్ష రూపాయల విలువచేసే మందు గుండు సామాగ్రిని స్వాధీనం చేసుకోవడం జరిగిందని నర్సీపట్నం రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రేవతమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మందు గుండు సామాగ్రిని తరలిస్తున్న ఏటి గైరంపేట గ్రామానికి చెందిన కేతవరపు జగదీష్ ఎటువంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న మందు గుండు సామాగ్రిని స్వాధీనం చేసుకుం టామని తెలిపారు.

ఎటువంటి అనుమతులు లేకుండా మంది గుండు సామాగ్రిని తరలించిన అమ్మకాలు చేపట్టిన అటువంటి వారిపై చట్టరీత్య తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా సిఐ రేవతమ్మ తెలిపారు.

రాష్ట్రంలో ప్రజా పరిపాలన కొనసాగుతోంది

- శారదాపీఠం భూములపై ప్రభుత్వం వివరాలు సేకరించడమే ఇందుకు ఉదాహరణ
తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్

విశాలాంధ్ర - భీమిలి: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రజలకు అనుకూలమైన నిర్ణయాలు తీసుకొని ముందుకు వెళుతున్నదని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ అన్నారు. శారదా పీఠానికి అధిపతి అని చెప్పుకుంటున్న ఎస్.ఎన్.పాల్ (స్వరూపానందేంద్ర సరస్వతి) హిందూయిజం ముసుగుతో గత అరాచక వైసిపి ప్రభుత్వం నుంచి కారు చౌకగా భూములను కొట్టేసిన అంశంపై.. దృష్టి సారించాలని తాము విజ్ఞప్తి చేసిన వెంటనే స్పందించి కూటమి ప్రభుత్వం వివరాలు సేకరించిందనీ అన్నారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రామ్ మాట్లాడుతూ కమర్షియల్ గా ఎకరా 15 నుంచి 20 కోట్ల రూపాయలు విలువ చేసే15 ఎకరాల భూములను కేవలం లక్ష రూపాయలు చొప్పున ఎస్.ఎన్.పాల్ (స్వరూపానందేంద్ర సరస్వతి) చేజిక్కించుకున్నారన్నారు. ఈ క్రమంలోనే తెలుగు శక్తి ఉద్యమస్ఫూర్తితో పీఠం అక్రమాలపై గళం ఎత్తడం, జిల్లా కలెక్టర్ కు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కు చివరకు ప్రధానమంత్రి, రాష్ట్రపతికి ఫిర్యాదులు చేసామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి గత వైసిపి ప్రభుత్వం ఎస్.ఎన్.పాల్ (స్వరూపానందేంద్ర సరస్వతి)కు అప్పగించిన భూముల వ్యవహారంపై వివరాలు పంపాల్సిందిగా ఆదేశించిందన్నారు. ఆదేశాలకు అనుగుణంగానే సంబంధిత అధికారులు భూముల వాస్తవ విలువ, ఎస్.ఎన్.పాల్ చెల్లించిన ధర విలువ వివరాలను ప్రభుత్వానికి నివేదించా రన్నారు. తెలుగు శక్తి విజ్ఞప్తికి స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు బి.వి.రామ్ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ఆ 15 రకాల భూమిని తక్షణమే స్వాధీనం చేసుకోవాలన్నారు.

నవంబర్ 23, 24న విశాఖ వేదికగా
వైజాగ్ జూనియర్ లిటరరీ ఫెస్ట్ 2024

విశాలాంధ్ర - విశాఖపట్నం: లిట్ లాంటర్న్ కల్చర్ అండ్ లిటరేచర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నవంబర్ 23, 24 తేదీలలో వైజాగ్ జూనియర్ లిటరరీ ఫెస్ట్ 2024ను విశాఖ నగరంలోని బీచ్ రోడ్‌లో ఉన్న హవా మహల్ వేదికగా నిర్వహిస్తున్నామని ఈ ఉత్సవాల డైరెక్టర్లు సోనాల్ సర్ద, సంధ్య గోడే, ప్రియా ఉప్పలపాటి తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ విశాఖ నగరంలోని చిన్నారులకు విభిన్న కళల పట్ల అవగాహన కల్పించడం ప్రధాన లక్ష్యంగా చిన్నారులతోపాటు వారి తల్లిదండ్రులకు కూడా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు ఈ ఫెస్ట్ ద్వారా నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు. అంతేకాకుండా చిన్నారులకు పుస్తకాలపై అవగాహన కల్పించేందుకు ఇది ఒక మంచి అవకాశం అని తల్లిదండ్రులు దీని వినియోగించుకోవాలని వారన్నారు. ఈ ఫెస్ట్‌లో



సుమారు 20కి పైగా పుస్తక రచయితలు కథా రచయితలు తమ కథలను చిన్నారులకు వివరి స్తారన్నారు. నాలుగు 4 నుండి 16 సంవత్సరాల వయసు గల పిల్లలందరూ పాల్గొనవచ్చునని రెండు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో సుమారు 60 సెషన్ లకు పైగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఫెస్ట్ కు సంబంధించిన రిజిస్ట్రేషన్ లను అక్టోబర్ 19 వ తేది నుండి విశాఖ నగరంలోని విఐపి రోడ్ లో ఉన్న తనిష్క్ షోరూమ్ లోను, జైల్ రోడ్డు వద్ద ఉన్న పేజెస్ బుక్ షాప్ తో పాటు లా సన్స్ బే కాలనీ ఉన్న బుక్ మ్యాజిక్ లైబ్రరీలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంధ్యా మేనేజ్ లిమిటెడ్ ఎండి ఆనంద్, పేజెస్ బుక్ స్టోర్ ఎండి సునీల్ నెవాటియ, కంకటాల ఎండి కంకటాల మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.